## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయికి రామంచ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ఉన్నత పాఠశాలకు చెందిన రాజేందర్, అవినాష్ జిల్లాస్థాయి అత్యపాత్య క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కొండపాక ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అండర్ 17 బాల, బాలికల జిల్లాస్థాయి అత్యపాత్య క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అవినాష్, రాజేందర్‌తో పాటు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు సంతోషిని హెచ్‌ఎం సత్తవ్వ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

### ఇసుక మాఫియాను అరికట్టండి: బీఎస్పీ నేతలు



మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

హుస్నాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరిట దోచుకుంటున్న ఇసుక మాఫియాను అరికట్టాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.2,500 ఉండేదని, ప్రస్తుతం ట్రాక్టర్ యాజమానులు మాఫియాగా ఏర్పడి రూ.6 వేలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ చుట్టు పక్క ప్రాంతాల్లో ఇసుకను డంపుచేసి పేద ప్రజలను దోచుకుంటున్నారని వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక ధర తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సుధాకర్, శంకర్, వెంకటేష్, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

### దివ్యాంగుల సమావేశం రేపు



మాట్లాడుతున్న నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో 13న నిర్వహించనున్న దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల సమావేశానికి మంద కృష్ణమాదిగ హాజరవుతారని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్‌మాదిగ చెప్పారు. పట్టణంలోని రాజరాజేశ్వర పంక్షన్ హాల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు రూ.6 వేలు, చేయూత పెన్షన్‌దారులకు రూ.4 వేలు, కండర క్షీణత వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటస్వామి, నాయకులు శంకర్, యాదగిరి, రాజు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం నాయకుల వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రాజుకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మండల కమిటీ సభ్యుడు గొర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో దీర్ఘకాలికంగా పరిష్కారంకాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా తాగునీటి సమస్య, పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వీధి దీపాల ఏర్పాటు లాంటి సమస్యలపై దృష్టి పెట్టాలని విన్నవించారు. నాయకులు రవి, సిద్దులు, కనకయ్య, సిద్దులు, మల్లయ్య, యాదవ్వ, ఐలవ్వ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



సర్టిఫికెట్, మెడల్స్‌తో విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో మూడు రోజులుగా దేశ స్వాలంబనపై నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు సోమవారం ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జూనియర్ విభాగంలో విద్యార్థులు రక్షిత, భానుశ్రీ, మన్విత; సీనియర్ విభాగంలో గౌతమి, అఫ్సాన్, వహీదా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. వారికి హెచ్‌ఎం సతీశ్ మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కూలీలకు ‘సురక్ష’



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- ఉపాధి కూలీలకు పీఎం సురక్ష బీమా
- రూ. 2 లక్షల పరిహారం పొందే అవకాశం
- జిల్లాలో 3.93 లక్షల మంది ఉపాధి కూలీలు
- యాక్టివ్ కూలీలకు వర్తింపు

సిద్దిపేటరూరల్: గ్రామాల్లో పేదలు పొట్టకూటి కోసం వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్తున్న క్రమంలో అలాంటి వలసలు నివారించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం ఈ పథకం ద్వారా కూలీలు ఉపాధి పొందుతున్నారు. వారికి మరో ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. ప్రీమియంలో కొంత మొత్తం కూలీలు చెల్లిస్తే వారికి బీమా కల్పించేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు జిల్లాలో బీమాలేని వారి వివరాలను సేకరించి బీమా చేయించేందుకు కృషిచేస్తున్నారు.

జిల్లాలో మొత్తం 1.97 లక్షల జాబ్‌కార్డులు ఉండగా వాటిలో 1.24 లక్షల యాక్టివ్ జాబ్ కార్డుదారులు ఉన్నారు. వారిలో 2.09 లక్షల మంది యాక్టివ్ కూలీలుగా ఉన్నారు. ప్రస్తుతం యాక్టివ్ కూలీలుగా ఉన్న వారందరికి ఈ సురక్ష బీమా యోజన వర్తించనుంది. బీమా కోసం 18 నుంచి 71 యేళ్లలోపు వారు జాతీయ బ్యాంకుల్లో పేరు నమోదు చేసుకోవాలి. ఈ ఖాతా ఆధార్‌కార్డుతో అనుసంధానమై ఉండాలి. బ్యాంకు ఖాతా ఉన్న బ్రాంచ్‌లో ఖాతా నుంచి ఏటా రూ.20 బీమాకు జమ చేస్తామని అంగీకారపత్రం ఇవ్వాలి.

**పరిహారం ఇలా..**

పేరు నమోదు చేసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తిగా అంగవైకల్యం కలిగినా రూ.2 లక్షల పరిహారం అందుతుంది. పాక్షికంగా అంగవైకల్యం కలిగితే రూ.లక్ష పరిహారం అందుతుంది. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ రూ.55 కోట్ల విలువ మేర కూలీలు వేతనాలు పొందారు.

**ఉపాధి పనులపై కూలీల ఆసక్తి**

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉపాధి హామీని మహిళలు అత్యధికంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రధానంగా వేసవి కాలంలో ఇతర పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు డిమాండ్ ఉంటుంది. రైతుల కోసం చేపట్టే పనులతో పాటుగా ఇతర అభివృద్ధి పనులకు ఉపాధి హామీ వినియోగంలోకి వస్తుంది. దీంతో ప్రభుత్వం ప్రతి యేటా కూలి పెంచుతూ వస్తుంది.

> **యాక్టివ్ కూలీలందరికీ వర్తిస్తుంది**
>
> 
>
> జాబ్ కార్డు కలిగి ఉండి యాక్టివ్‌గా ఉన్న ప్రతి ఉపాధి కూలీకి ఈ బీమా పథకం వర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనికి చివరి తేదీ అంటూ ఏమీ లేదు. జిల్లాలో బీమాలేని వారి సమాచారం సేకరించాలని, లేని వారికి బీమా కల్పించేలా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రతి ఒక్కరికీ బీమా కల్పించడమే లక్ష్యంగా అవగాహన కల్పిస్తున్నాం. - జయదేవ్‌ఆర్య, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

# క్రమశిక్షణే భవిష్యత్‌కు తొలిమెట్టు

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య**



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థుల భవిష్యత్‌కు క్రమశిక్షణే తొలిమెట్టని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ఆయన మనవరాలు శ్రీయాన్విక పుట్టిన రోజు సందర్భంగా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 150 మంది విద్యార్థులకు సోమవారం రూ.70 వేల విలువ కలిగిన క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజిక సేవను అలవర్చుకోవాలన్నారు. అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ అంజాగౌడ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజేందర్, మాజీ ఎంపీటీసీ ఉమారాణి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రభాకర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలకృష్ణ, రాజేశ్వరి, ఇందిరా, నవిత తదితరులు పాల్గొన్నారు.

### పారదర్శకతకు ‘ఈ ఆఫీస్’

**మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్**



సిద్దిపేటజోన్: మున్సిపాలిటీలో అన్ని విభాగాల ప్రక్రియ ఈ-ఆఫీస్ ద్వారానే నిర్వహించాలని, పారదర్శకతకు ఆస్కారం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయా విభాగాల సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, వార్డు అధికారులకు ఈ ఫైలింగ్ నిర్వహణ వ్యవస్థ గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆఫీస్ విధానం ద్వారా అన్ని వివరాలు ట్రాక్ అవుతాయన్నారు. అవసరమైన ఫైల్స్ దొరకపోవడం, తడిసిపోవడం, అగ్నికి ఆహుతి కావడం లాంటి సమస్యలు ఉండవని, ఎక్కడి నుంచైనా.. ఎప్పుడైనా ఫైల్స్ పరిశీలించే అవకాశం ఉంటుందని చెప్పారు. అత్యవసర ఫైల్స్ ట్యాగ్‌చేసే వెసులుబాటు ఉంటుందని వివరించారు. అనంతరం ఫైల్ నిర్వహణ, డిజిటల్ సంతకం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

# ఎల్లుండితో రైతు బీమా గడువు ముగింపు

అక్కన్నపేట(హుస్నాబాద్)/నంగునూరు(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/మిరుదొడ్డి(దుబ్బాక)/హుస్నాబాద్‌రూరల్/దౌల్తాబాద్(దుబ్బాక): కొత్తగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు, అంతకు ముందు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు 13వ తేదీలోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని పలు మండలాల వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. ఆయా మండలాలకు చెందిన ఏఈఓ శ్రీలత, ఏఓ గీత, ఏడీఏ కాంపాటి మల్లయ్య, నాగరాజు, మల్లేశం, ఏఓ పూజ సోమవారం మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా రైతులకు ఏకారణం చేతనైనా మరణం సంభవిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల మొత్తాన్ని ప్రభుత్వం బీమాగా అందజేస్తుందని తెలిపారు. 2025 జూన్ 5వ తేదీ నాటికి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు రైతుబీమాకు అర్హులని చెప్పారు. సంబంధిత పత్రాలను 13వ తేదీలోగా ఆయా అధికారులకు అందజేయాలని సూచించారు.

# నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

నులిపురుగుల నివారణతోనే పిల్లలు ఆరోగ్యం సాధ్యమని పలువురు అధికారులు, వైద్యులు సూచించారు. 'జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం' సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పలు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి 19 యేళ్లలోపు వారికి మాత్రలు అందజేశారు.



చిన్నకోడూరులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డా.ఐశ్వర్య



జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ నిర్మల



వర్గల్ కేజీబీవీలో మాత్రలు వేస్తున్న తహసీల్దార్ బాల్‌రాజు తదితరులు



దౌల్తాబాద్(దుబ్బాక): ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డా.నాగరాజు



మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థినికి మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

## సంక్షిప్త వార్తలు

**◆ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన**

చేర్యాల(సిద్దిపేట): మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ మేరి సగయ ధనపాల్ అన్నారు. మండల పరిదిలోని నాగపురి రైతువేదికలో చేర్యాల ఎస్‌బీఐ అంగడిబజార్, ఏడీబీ మెయిన్‌రోడ్ బ్రాంచిల ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ అధికారులు రవికుమార్‌వర్మ, వినోద్‌కుమార్, కె.మారుతి, బి.శ్రీలత, అనీష్‌కుమార్ పాల్గొన్నారు.

**ప్రాథమిక పాఠశాలలో..**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్‌లు మహేష్, ప్రవీణ్ మాట్లాడుతూ డబ్బులు పొదుపు, ఆన్‌లైన్ బదిలీ గురించి వివరించారు. హెచ్‌ఎం తిరుమలేశ్ పాల్గొన్నారు.

**◆ వెంకటయ్యను విమర్శించే హక్కు లేదు**

మిరుదొడ్డి(దుబ్బాక): దళిత సమస్యలపై పనిచేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను విమర్శించే నైతికహక్కు దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి లేదని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పాపని సురేశ్‌గౌడ్, ఉల్లెంగెల నరేశ్ హితువు పలికారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభాకర్, స్వామి, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**◆ అన్నివేళలా అందుబాటులో ఉంటాం**

సిద్దిపేటరూరల్: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా అన్నివేళలా అందుబాటులో ఉంటామని ఎస్‌ఐ రాజేశ్ భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని రాఘవాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సైబర్ మోసాలు, మహిళా రక్షణకు ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా వేధించినా, వెంబడించినా 100, షీ టీమ్ 8712667434కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. హెచ్‌ఎం మంజు భార్గవి, షీ టీం ఏఎస్‌ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్ రజని, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, మురళి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

**◆ క్రీడా దుస్తులు, షూస్ పంపిణీ**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్ ఉన్నత పాఠశాలలో 65 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థులు క్రీడా దుస్తులు, షూస్ పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థి బియ్య రమేశ్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహకరించిన పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. హెచ్‌ఎం రేష్మాశౌకత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**◆ ఆలయ నిర్మాణానికి విరాళం**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని జాలపల్లి పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం మాజీ ఎంపీటీసీ చెట్కూరి కల్యాణికమాలకర్ యాదవ్ నిర్వాహకులకు సోమవారం రూ.50 వేలు విరాళం అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని కోరారు.

**◆ హైకోర్టు కోర్టు మాస్టర్‌కు సన్మానం**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లికి చెందిన కోమటిరెడ్డి రమాకాంత్ హైకోర్టులో కోర్టు మాస్టర్ ఉద్యోగం సాధించాడు. మొదటి సారిగా గ్రామానికి రావడంతో రమాకాంత్‌ను గ్రామస్తులు సోమవారం సన్మానించారు.

**◆ మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు**

హుస్నాబాద్: మోడల్ స్కూల్/కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.విశ్వనాథ్ సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 20వ తేదీలోపు పాఠశాలలో సంప్రదించాలని కోరారు. ఇంటర్ చదివే విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

**◆ ఘనంగా బోనాల సంబురాలు**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తిలో బీరప్ప బోనాల పండుగలో భాగంగా పోచమ్మ పలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. పొట్టేళ్లతో కట్టిన పలహారం బండిని గ్రామంలో పోతరాజుల విన్యాసాల మధ్య అట్టహాసంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వివిధ పార్టీల నాయకులు కృష్ణారెడ్డిరెడ్డి, యాదయ్య, కొండల్‌రెడ్డి, సంతోష్‌కుమార్, మల్లేశం, కమాలకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం పోరాటం

**జేఏసీ చైర్మన్ పరమేశ్వర్**





సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల అస్తిత్వం, ఉనికి, ఆత్మగౌరవం కోసం జరిగే పోరాటంలో భాగమే నేటి విద్యాసంస్థల బంద్ అని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. నేటి విద్యాసంస్థల బంద్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, బంద్‌ను మినీ సకలజనుల సమ్మెగా గుర్తించి వెంటనే చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక జేఏసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, యాజమాన్యాలతోపాటు పరోక్షంగా ఉపాధ్యాయులు పాల్గొనే ఈ బంద్‌ను మినీ సకల జనుల సమ్మెగా భావించి చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. డివిజన్ ఏర్పాటు చేయకపోతే రాబోయే రోజుల్లో అధికార పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. జేఏసీ నాయకులు అశోక్, బీరయ్య, సత్యనారాయణ, బాలనర్సయ్య, వెంకటాద్రి, బాలుమోహన్, యాదగిరి, నర్సింహాచారి, భాస్కర్‌రెడ్డి, సత్తయ్య, కనకయ్య, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వం

**బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి**



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం గజ్వేల్‌లో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆచరణకు సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నేడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ చెప్పిన కాంగ్రెస్ ఆచరణలో విఫలమయ్యిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నవాజ్‌మీరా, కృష్ణారెడ్డి, విరాసత్‌అలీ, గోపాల్‌రెడ్డి, రజిత, కనకయ్య, రవీందర్, సురేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేశ్, అహ్మద్, స్వామి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్, హరీశ్‌రావు డ్రామాలు బయట పెడతా

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు**



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

దుబ్బాక: కేసీఆర్ హరీశ్‌రావుల డ్రామాలు బయట పెడతానని, వాళ్లను నిద్రపోకుండా చేస్తానంటూ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్, హరీశ్‌రావులే కొంత మందిని డబ్బులతో పెట్టుకొని డ్రామాలు ఆడిస్తున్నారన్నారు. రేపిస్టులు, చోటామోటా నాయకుల గురించి తాను మాట్లాడనని పరోక్షంగా కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన చక్రధర్‌గౌడ్‌ను ఉద్దేశించి అన్నారు. రామలింగేశ్వర ఆలయానికి సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకొచ్చి ఆలయ అభివృద్ధికి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తానని మైనంపల్లి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు మచ్చ శ్రీనివాస్, ఆకుల దేవేందర్, సురేశ్, రాంచంద్రారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

# చక్రధర్‌గౌడ్ ఫైటర్ కాదు.. చీటర్

**కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్**



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన చక్రధర్‌గౌడ్ ఫైటర్ కాదని, అతను ఒక పెద్ద చీటర్ అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో కనీస సభ్యత్వంలేని చక్రధర్‌గౌడ్ పార్టీకి రాజీనామా చేసినా నష్టం ఏమీ లేదన్నారు. ఆర్టీఐ పెడుతూ వ్యాపారస్తులను బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయం మైనంపల్లి హన్మంతరావుకు తెలియడంతో అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారని, రెండు, మూడు రోజుల్లో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని తెలియడంతో ముందుగానే రాజీనామా చేశారని ఎద్దేవా చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, మహేందర్, ఎల్లం, రియాజొద్దిన్, లక్ష్మి, యాదగిరి, సతీశ్, కలీమొద్దిన్ పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలి

**కావేరీ యూనివర్సిటీ చాన్స్‌లర్ భాస్కరరావు**



వర్గల్(గజ్వేల్): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేస్థాయికి ఎదగాలని కావేరీ యూనిర్సిటీ చాన్స్‌లర్ జీవీ భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని గౌరారం యూనివర్సిటీ హాల్‌లో సోమవారం ఇంజనీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ, అత్యుత్తమ అధ్యాపక వర్గంతో నాణ్యమైన విద్య అందజేస్తున్నామన్నారు. అలాగే వివిధ సర్కారు పాఠశాలలను దత్తత తీసుకుని విద్యావికాసానికి బాసటగా నిలుస్తున్నామని చెప్పారు. వీసీ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు అబ్దుల్ కలాం బాటలో ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ స్కూల్ డీన్ డాక్టర్ కొండా శ్రీనివాస్, మణిపూర్ యూనివర్సిటీ చాన్స్‌లర్ టి.తిరుపతిరావు, కావేరి సీడ్స్ వైస్‌చైర్మన్ డాక్టర్ జి.పవన్, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, డాక్టర్ హర్ష, డాక్టర్ ఎ.ప్రతాప్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన తప్పదు

**రాష్ట్ర ఎంఈసీ మాజీ సభ్యుడు సాయిరాం**

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని లేకపోతే ఆందోళన తప్పదని రాష్ట్ర మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు సాయిరాం హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న 96 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 5 నెలలుగా జీతాలు రావడం లేదని, దీంతో వారంతా చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్, ఉమ్మడి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ జోక్యం చేసుకొని వెంటనే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో వారికి అండగా ఉండి పోరాడతామని చెప్పారు. బీఆర్‌టీయూ నాయకులు నర్సింహులు, అరవింద్, శోభన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.